క్లుప్తంగా

రేవంత్‌రెడ్డిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు



రేవంత్‌రెడ్డితో శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న తన నివాసంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సంపూర్ణ మెజార్టీ సాధించడంపై శుభాకాంక్షలు తెలిపారు.

ఆరబెట్టిన తర్వాతే ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలి

ఖానాపూర్: రైతులు కోసిన వరిధాన్యాన్ని కల్లాల వద్దే ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ఏఎంసీ కార్యదర్శి అజాం అలీ, పీఏసీఎస్ కార్యదర్శి భూమి ఆశన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు పంట కోసిన వెంటనే నేరుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. పంటను కల్లాల వద్దే ఆరబెట్టి తేమశాతం పరిశీలించేందుకు కొంత ధాన్యాన్ని శాంపిల్‌గా తీసుకొచ్చి నిర్వాహకులకు చూపించాలని రైతులను కోరారు.

భక్తుడి విరాళం



విరాళం ఇస్తున్న సూర్యచంద్రశర్మ

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభానికి తొడుగు ఏర్పాటు చేసేందుకు ఓ వ్యక్తి తన వంతుగా రూ.50వేలను విరాళంగా అందించారు. హైదరాబాద్‌కు చెందిన సూర్యచంద్ర శర్మ సిద్ధాంతి మంగళవారం లక్ష్మణచాంద వచ్చి ఆలయంలో కమిటీ సభ్యులకు రూ.50వేలను తనవంతుగా అందించారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు రాజు, రాహుల్ తదితరులు ఉన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో చేపట్టిన పంచాయతీ భవన నిర్మాణ పనులను మంగళవారం డీఎల్‌పీఓ శివకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామంలో పరిశుభ్రతకు పెద్దపీట వేసి పంచాయతీ ట్రాక్టర్ ద్వారా తడి, పొడి చెత్తను సేకరించాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, ఎంపీవో మోజంహుస్సేన్, రాంకుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాఠశాల తనిఖీ

భైంసా: ముధోల్‌లోని రెసిడెన్షియల్ మైనార్టీ పాఠశాలను మంగళవారం స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయాలని సి బ్బందికి సూచించారు. వారి వెంట ఎంపీడీవో సురేశ్‌బాబు తదితరులు న్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన



ఓలాలో నీళ్లు పడుతున్న మసార్‌రావు

కుంటాల: డ్రై డే సందర్భంగా మండలంలోని ఓలా గ్రామంలో మంగళవారం చేపట్టిన పారిశుధ్య పనులను మండల ప్రత్యేకాధికారి మసార్‌రావు పరిశీలించారు. హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ, కొనుగోలు కేంద్రం, సెగ్రిగేషన్‌షెడ్డు, వైకుంఠధామాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో రహీం, సర్పంచ్ కనీస్ ఫాతిమా, కార్యదర్శి యోగేశ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పర్యటన

దస్తురాబాద్: గ్రామాల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆకొండపేట, దస్తురాబాద్ గ్రామాల్లో పర్యటించారు. ఆయా పంచాయతీల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పల్లె ప్రకృతివనాలు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. వారి వెంట ఎంపీడీవో విజయ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీవో అనిల్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల్లో పోషకాహారం..

- కేంద్రాల్లో రుచికర భోజనం అందిస్తున్న నిర్వాహకులు
- చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న టీచర్లు
- గర్భిణులు, బాలింతలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్న వైనం



రాజూరలో ఆటపరికరాలతో బోధిస్తున్న టీచర్



లోకేశ్వరం మండలం ధర్మోర అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

లోకేశ్వరం: చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపం నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. అందులో భాగంగా సిబ్బంది కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు రుచికరమైన భోజనం అందిస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారు. చిన్నారులకు పూర్వ ప్రాథమికవిద్య, నాణ్యమైన ఆహారం అందిస్తుండటంతో కేంద్రాలకు వచ్చేందుకు లబ్ధిదారులు ఆసక్తి కనబరుస్తున్నారు.

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల సమాచారం..

జిల్లాలోని 19 మండలాల్లో ముధోల్, భైంసా, ఖానాపూర్, నిర్మల్ అనే నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 926 అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. అందులో 59,373 మంది చిన్నారులు, 5811 మంది గర్భిణులు, 5351 మంది బాలింతలు లబ్ధి పొందుతున్నారు. మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 24,884 మంది ఉన్నారు. జిల్లాలోని 926 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను 789 కేంద్రాల్లో కిచెన్‌గార్డెన్లు ఏర్పాటు చేసి తాజా కూరగాయలతో భోజనం అందిస్తున్నారు.

లబ్ధిదారులకు అందుతున్న ఆహారం..

కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు ఆరోగ్యలక్ష్మి పథకం కింద ఒక పూట భోజనం, కోడిగుడ్డు, పాలు అందిస్తున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల చిన్నారులకు నెలకు 16 కోడిగుడ్లు, బాలామృతం ప్యాకెట్, మూడు నుంచి ఐదేళ్ల చిన్నారులకు రోజుకో కోడిగుడ్డు, గర్భిణులు, బాలింతలకు రోజుకు రూ.200 మి.లీ పాలు అందిస్తున్నారు. కిచెన్‌గార్డెన్లతో తాజా కూరగాయలతో ఆహారం ఇస్తున్నారు.

చిన్నారుల ఇళ్లకు ఆయాలు ..

కేంద్రాలకు వచ్చే లబ్ధిదారుల హాజరుశాతం పెంచేందుకు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆయాలు వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. కేంద్రాల్లో అందించే తాజా ఆహారం, చిన్నారులకు చెప్పే వ్యక్తిగత పరిశుభ్రత, పాఠాలను వివరిస్తున్నారు. దీంతో స్వచ్ఛందంగానే చిన్నారులు కేంద్రాలకు వస్తున్నారు.

అవగాహన సదస్సులు..

మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి తీసుకోవాలిసిన ఆహారం, సుఖప్రసవం కోసం అవగాహన కల్పించడం, ప్రసవం అయ్యాక తల్లిపాల ప్రాధాన్యతను కేంద్రాల్లో వివరిస్తున్నారు.

గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలతోపాటు చిన్నారులకు ఇచ్చే వ్యాక్సిన్లు ఉచితంగా అందిస్తున్నారు. మూడేళ్లు దాటిన వారికి పాఠాలు సైతం బోధిస్తున్నారు.

అల్లరి తగ్గింది



పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్తుండటంతో ఇంటి వద్ద అల్లరి తగ్గింది. పిల్లలకు పద్యాలు, అక్షరాలను కేంద్రాల్లో నేర్పుతున్నారు. దీంతో చిన్నారులను ఉదయమే అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తున్నాం.
– సాయవ్వ, బామ్నితే

వచ్చేవారు పెరుగుతున్నారు



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. ఆటపరికరాలతో విద్యాబుద్ధులు నేర్పిస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.
– విమల, అంగన్‌వాడీ టీచర్, ధర్మోర

పోషకాహారం అందిస్తున్నాం

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందించి చిన్నారులను ఆకట్టుకునేలా ఆటపరికరాలను ఏర్పాటు చేస్తున్నాం. కిచెన్‌గార్డెన్లలో పండిన తాజా కూరగాయలతో భోజనం అందిస్తున్నాం. నిత్యం ఏదో ఒ క చోట కేంద్రాలను తనిఖీ చేస్తున్నాం. లోపాలుంటే సరిచేస్తున్నాం.
– విజయలక్ష్మి, జిల్లా శిశుసంక్షేమ అధికారి

యూడైస్‌పై హెచ్‌ఎంలకు శిక్షణ



కడెంలో శిక్షణ పొందుతున్న సిబ్బంది



తానూరులో మాట్లాడుతున్న ఎంఈవో సుభాష్

కడెం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం యూడైస్‌పై మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షకులు బొమ్మిడి మహేశ్వర్ యూడైస్ గురించి అవగాహన కల్పించి హెచ్‌ఎంల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కడెం జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, సీఆర్పీలు తదితరులున్నారు.

తానూరు: యూడైస్‌లో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈవో సుభాష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యూడైస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు, గదుల వివరాలను తెలపాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా స్కూల్ కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంటాల: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యూడైస్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, మరుగుదొడ్లు, వంటగది, మధ్యాహ్న భోజనం తదితర మౌలిక వసతులపై చర్చించారు. ప్రధానోపాధ్యాయులు అంబకంటి సతీశ్‌కుమార్, ఎల్లన్న, నరేశ్‌కుమార్, అమృతం, భోజన్న, సీసీవోలు నవీన్‌రెడ్డి, దశరథ్ పాల్గొన్నారు.

భైంసా: ముధోల్ ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యూడైస్‌పై శిక్షణ నిర్వహించారు. యూడైస్ ఫారం ఫీలింగ్‌పై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎంఈవో మైసాజీ పాల్గొని మాట్లాడారు. ప్రతి పాఠశాల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. సీఆర్పీలు ఉన్నారు.

‘ప్రజాదరణతోనే కాంగ్రెస్ గెలుపు’



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: నియోజకవర్గంలో ప్రజాదరణతోనే ఆదివాసీ బిడ్డ, కాంగ్రెస్ అభ్యర్థి బొజ్జు గెలుపొందారని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శులు పీటర్, సురేందర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోట్లాది రూపాయల డబ్బు, మద్యం పంపిణీ చేసినప్పటికీ ప్రజాదరణ ముందు అవి నిలువలేకపోయాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల గారడీ మాటలను ప్రజలు నమ్మలేదన్నారు. సమావేశంలో దళితసంఘ నాయకుడు మల్లేపల్లి స్వామి, ఆదివాసీ నాయకుడు తొడసం శంభు తదితరులు ఉన్నారు.

‘బొజ్జు గెలుపు ఆదివాసీలకు గర్వకారణం’



మాట్లాడుతున్న నాయకులు

కడెం: ఖానాపూర్ ఎమ్మెల్యేగా వెడ్మ బొజ్జు గెలుపొందడం ఆదివాసీ సమాజానికి గర్వ కారణమని తుడుందెబ్బ మండలాధ్యక్షుడు ఉర్వేత ఆనంద్‌రావు అన్నారు. మంగళవారం కడెంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మూడు దశాబ్దాల తర్వాత ఖానాపూర్ గడ్డపై ఆదివాసీ బిడ్డ ఎమ్మెల్యేగా గెలుపొందారని పేర్కొన్నారు. బొజ్జు గెలుపునకు సహకరించిన గిరిజనేతరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఆదివాసీ నాయకులు ఇస్రూ, జైతు, చిన్ను, జుగదిరావు, మాన్కు, బడిరావు, శ్యాంరావు, కాంతారావు తదితరులు ఉన్నారు.

‘ గెలిపించినందుకు ధన్యవాదాలు’

లక్ష్మణచాంద: నిర్మల్ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డిని గెలిపించినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆ పార్టీ నాయకులు అడ్వాల రమేశ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ మండలాధ్యక్షుడు పాలాస గోవర్ధన్, ఉపాధ్యక్షుడు రంజిత్, లక్ష్మణచాంద సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీ నర్సారెడ్డి, మల్లాపూర్ సర్పంచ్ రవి, సురేశ్, జీవన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేశ్వర్ రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

కత్తెర పురుగుతో అప్రమత్తంగా ఉండాలి

నర్సాపూర్(జి): మొక్కజొన్న పంటను దెబ్బతీస్తున్న కత్తెరపురుగుతో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈవో గణేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని అంజనీతండా గ్రామ శివారులోని మొక్కజొన్న పంటను రైతులతో కలిసి ఏఈఓ పరిశీలించారు. 15 లేదా 20 రోజుల పంటలో కత్తెర పురుగును గమనిస్తే ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాముకు లీటర్ నీరు, వేపనూనె కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యకమంలో రైతులు, సిబ్బంది ఉన్నారు.

ముధోల్ ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు



రామారావుపటేల్‌ను కలిసిన కన్కపూర్ గ్రామస్తులు

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామస్తులు మంగళవారం ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్‌ను భైంసాలోని తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం గ్రామంలోని సమస్యలను విన్నవించారు.

కుంటాల మండల నాయకులు..

కుంటాల: భైంసాలోని తన నివాసంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను మండలంలోని నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్, గుద్దేటి నర్సయ్య, జీవి రమణారావు, వెంగళరావు, శివ, గజేందర్, ఎంపీటీసీ కట్ట రవి తదితరులు ఉన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల వినతి

భైంసాటౌన్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స అందిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్‌ఎంపీ, పీఎంపీల సంక్షేమ సంఘం డివిజన్ నాయకులు నూతన ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వపరంగా శిక్షణ అందించి గుర్తింపుకార్డులు అందించాలని కోరారు. అంతకు ముందు వారిని సన్మానించారు. ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు మోహన్, కార్యదర్శి సాగర్, విజయ్‌కుమార్, రమాకాంత్, అశోక్ పాల్గొన్నారు.

మట్టి సంరక్షణ అందరి బాధ్యత



భైంసాలో ఓ పాఠశాల విద్యార్థులు



సోన్‌లో రైతుతో వ్యవసాయాధికారులు

ఖానాపూర్: పర్యావరణ పరిరక్షణతోనే సమస్త జీవకోటి సజీవంగా ఉంటుందని ఆర్య పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర్ అన్నారు. ప్రపంచ మృత్తికా దినోత్సవం(వరల్డ్ సాయిల్ డే) సందర్భంగా మంగళవారం పట్టణంలోని పాఠశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రోజురోజుకు ప్లాస్టిక్ వినియోగం పెరిగి భూమిలో సారవంతం తగ్గిపోతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. భూములు కలుషితం కాకుండా వాననీటి సంరక్షణ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని శ్రీ గౌతమి హైస్కూల్‌లో మంగళవారం ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించారు. నేల ప్రాధాన్యత తెలిసేలా విద్యార్థులతో వరల్డ్ సాయిల్ డే ఆకారంలో కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మట్టి సంరక్షణ అందరి బాధ్యతని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రేగుంట రవీందర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరికొయ్యలకు నిప్పుపెట్టొద్దు..

సోన్: వరికొయ్యలకు నిప్పుపెడితే నేలలోని భూసారం తగ్గుతుందని మండల వ్యవసాయాధికారి వినోద్ అన్నారు. మట్టి దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం రైతులకు మట్టి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వరికొయలను కలిపి దున్నితే నేలలో భూసారం పెరిగి మంచి దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అంబాజీ, రైతులు పాల్గొన్నారు.

మబ్బులతో రైతుల గుండెల్లో గుబులు

- తుపాన్ ప్రభావంతో చిరుజల్లులు
- పలుచోట్ల నేలకొరిగిన వరి
- ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పిన అన్నదాతలు



ధర్మోరలో ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతులు



పెంబి: మందపల్లిలో ధాన్యంపై టార్పాలిన్లు

లోకేశ్వరం: మండలంలోని అర్లి, గొడిసెరా, లోకేశ్వరం, పుస్పూర్, హావర్గ, బిలోలి, అబ్దుల్లాపూర్, రాయపూర్‌కాండ్లీ,ధర్మోర, పంచగుడి, ఎడ్దూర్, గడ్‌చాంద తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. దీంతో కల్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం కుప్పలను కాపాడుకునేందుకు రైతులు టార్పాలిన్లు కప్పుతూ ఇబ్బంది పడ్డారు.

పెంబి: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో మండలంలో కమ్ముకొస్తున్న మబ్బులతో రైతన్న గుండెల్లో గుబులు మొదలైంది. వరి పొలం కోత దశకు చేరినా హార్వెస్టర్ల కొరతతో ఆలస్యం అవుతోంది. దీంతో పలు చోట్ల పొలం నేలకొరుగుతుంది. మరోవైపు కోసిన ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పి రైతులు పంటలను కాపాడుకుంటున్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్, అందాకూర్, ఓల, కుంటాల, లింబా(కే) గ్రామాల్లో మంగళవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. చల్లని ఈదురుగాలులు వీయడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం తడవకుండా టార్పాలిన్లను కప్పి ఉంచారు.

నేడు భూసార్ బీట్ బంద్

భైంసాటౌన్: భైంసా వ్యవసాయ మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు బుధవారం నిలిపేయనున్నట్లు ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి అడెల్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా హమాలీ యూనియన్ అభ్యర్థన మేరకు బీట్ బంద్ ఉంచినట్లు పేర్కొన్నారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు. తిరిగి గురువారం నుంచి యథావిధిగా కొనుగోళ్లు చేపడుతామని పేర్కొన్నారు.

పార్‌పెల్లిలో డ్రై డే

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో మంగళవారం డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రెయినేజీలను శుభ్రం చేసి డంపింగ్ యార్డ్‌కు తరలించేలా చర్యలు చేపట్టారు. జ్వరంతో బాధపడుతున్న వారి రక్తనమూనాలు సేకరించి అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు శివకృష్ణగౌడ్ ఉన్నారు.

కేసీఆర్‌ను కలిసిన అల్లోల, విఠల్‌రెడ్డి

నిర్మల్: ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి మాజీ సీఎం కేసీఆర్‌ను మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కలిశారు. హైదరాబాద్‌లో మంగళవారం వారిద్దరు కలిసి కేసీఆర్‌తో మాట్లాడారు. అనంతరం అక్కడే మాజీ మంత్రి, బీఆర్‌ఎస్‌వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి ఎన్నికల ఫలితాలపై చర్చించారు.

కార్యాలయాలు పరిశీలన

కుభీర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, ఉన్నత పాఠశాల, మండల ప్రజాపరిషత్ కార్యాలయాలను మంగళవారం మండల ప్రత్యేక అధికారి(నోడల్ అధికారి) హన్మండ్లు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్యం, ఇతర అంశాల గురించి కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు.

న్యూవెల్మల్‌లో ఎన్‌సీడీ పరీక్షలు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఆరోగ్య సిబ్బంది పలువురికి ఎన్‌సీడీ(నాన్ కమ్యూనికేబుల్ డీసీజెస్) పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించగా 65 షుగర్, 115 బీపీ కేసులు, ఒక లెప్రసీ, ఒక క్యాన్సర్ కేసు నమోదైనట్లు సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంకుల్ నాగయ్య, ఏఎన్‌ఎం కల్యాణి, సునీత, కళావతి పాల్గొన్నారు.

నర్సరీల ప్రణాళికలు సిద్ధం చేయండి

లోకేశ్వరం: హరితహారంలో భాగంగా 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో ఏర్పాటు చేసే నర్సరీల ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. ప్రతి గ్రామంలో పంచాయతీ ట్రాక్టర్ ద్వారా తడి,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. కార్యదర్శులు గ్రామాల్లో నిర్వహించే సమావేశాలకు హాజరవాలని కోరారు. రోగాలు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, ఈజీఎస్ సిబ్బంది, కార్యదర్శులు తదితరులున్నారు.



ఎస్పీ క్యాంపు కార్యాలయం ఎదుట ..



శాంతినగర్ ఎక్స్‌రోడ్‌లో పీవీ విగ్రహం

ముసుగు తీయలే..

రాష్ట్రంలో అక్టోబర్ తొమ్మిదో తేదీ నుంచి అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో నిర్మల్‌లోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేశారు. ఎన్నికల కోడ్ ముగిసినా జిల్లా కేంద్రంలోని శాంతినగర్, ఎస్పీ క్యాంపు కార్యాలయం ఎదుట ఉన్న పీవీ నరసింహారావు, ఎన్టీఆర్ విగ్రహాలకు వేసిన ముసుగు మాత్రం అధికారులు తొలగించడం లేదు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

సన్మానం

కుంటాల: మండలంలోని కల్లూరు ఉన్నత పాఠశాలలో పని చేసిన హెచ్‌ఎం వాటోలి ముత్యం, ఉపాధ్యాయుడు సాయారెడ్డి ఇటీవల బదిలీపై వెళ్లారు. కాగా మంగళవారం వీరిని కల్లూరు పాఠశాలలో తోటి సిబ్బంది ఘనంగా సన్మానించారు.